క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సారె సమర్పణ



సారె తీసుకొస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని పద్మశాలీ సంఘం ప్రతినిధులు శనివారం కనకమహాలక్ష్మికి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి ఏటా ఆనవాయితీగా అమ్మవారికి సారె సమర్పిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంజి చిరంజీవి, కొప్పుల ప్రభావతి రమేష్, సూరిశెట్టి సూరి బాబు, పప్పు రాజారావు, కరణం వేంకటేశ్వ రరావు, కులపాక సన్యాసిరావు, తెడ్లపు వెంకటేశ్వర రావు, రాము, అప్పలరాజు, కోటేశ్వర రావు, రాపర్తి సుబ్బారావు, పుత్తయ్య, రాఘవులు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ మత్స్యకార సంఘం నూతన కమిటీ నియామకం



ప్రధాన కార్యదర్శి నల్లయ్య



అధ్యక్షుడు పోతయ్య

అల్లిపురం : ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం (ఏఐటీయూసీ) విశాఖ జిల్లా నూతన కమిటీ శనివారం ఎన్నికయింది. సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సభ్యులు జిల్లా గౌరవాధ్యక్షుడిగా పల్లెటి పోలయ్య, ప్రధాన కార్యదర్శిగా వాసుపల్లి నల్లయ్య, అధ్యక్షుడిగా కరక పోతయ్య, కోశాధికారిగా గరికిన లక్ష్మణరావుతో పాటు 25 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. బజారులో వ్యాపారం చేసే మత్స్యకారులకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వం జిల్లాలో ప్రతి ప్రాంతంలో మత్స్యకార మార్కెట్లు ఏర్పాటు చేయాలని, మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఇస్తున్న జీవనభృతి పెంచాలని, అందరికీ గృహ సదుపాయం కల్పించాలని తీర్మానించారు.

రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్‌తో అవస్థలు



గీత్ సంగీత్ జంక్షన్‌లో రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్

అల్లిపురం : రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్‌తో వాహన చోదకులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. గీత్ సంగీత్ థియేటర్ వద్ద రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్‌ను జీవీఎంసీ సిబ్బంది వదిలి వెళ్లిపోయారు. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీని వలన శనివారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోయింది. తక్షణమే అధికారులు స్పందించి డస్ట్‌బిన్ తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరానికి హాజరైన స్థానికులు

అల్లిపురం : బంగారుమెట్ట, శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం, శ్రీ గౌరీ సేవా సంఘం ఆవరణలో శనివారం ఓమిని ఆర్కే ఆస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య బృందం బంగారుమెట్ట వాసులకు ఉచితంగా బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం నిమిత్తం సిఫారసు చేశారు.



ఆకర్షణీయంగా ఎంవీడీ హైస్కూలు ప్రధాన ఆర్చి



క్రమశిక్షణతో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

సరికొత్తగా.. చదువుల ప్రపంచం

- నాడు–నేడు ద్వారా ఎంవీడీ హైస్కూల్ ఆధునికీకరణ
- ఉపాధ్యాయులు, విద్యార్థులకు సకల సదుపాయాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్టూడెంట్స్.. పేరెంట్స్



సీఎం జగన్ నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ లుక్ తీసుకొచ్చారు. అలాగే మౌలిక సదుపాయాలు కల్పించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి చేసిన ఈ పనులు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపు కూడా చూడని విద్యార్థులు ఇప్పుడు గవర్నమెంట్ బడుల్లో పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. చక్కటి బోధన, కోరుకున్న సదుపాయాలున్న సర్కారీ బడులే ఇప్పుడు మాకు ముద్దు అంటూ విద్యార్థులు ముక్తకంఠంతో చెబుతున్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు కేటాయించిన ఐఎఫ్ ప్యానల్స్

డాబాగార్డెన్స్ : నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా అనేక పాఠశాలలు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చెందాయి. జీవీఎంసీ ఎంవీడీ దండుబజార్ ప్రాథమికోన్నత పాఠశాల కూడా అభివృద్ధి బాట పట్టింది. రూ.51 లక్షలతో పాఠశాలలో అన్ని రకాల వసతులు కల్పించారు. టాయ్‌లెట్స్ (బాలురు, బాలికలకు వేర్వేరుగా) ఆధునికీకరించారు. అంతేకాక చైల్డ్ విత్ స్పెషల్ నీడ్స్ (సీడబ్ల్యూఎస్ఎన్)తో ప్రత్యేక టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు. నీటి కొరత లేకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి తరగతి గది ఫ్లోరింగ్ మార్చారు. ప్రతి క్లాసు రూములో 4 ఫ్యాన్లు, 4 ట్యూబ్‌లైట్లు వేశారు. పాఠశాలలో సంపు ఏర్పాటు చేసి మోటారు ద్వారా మంచినీటిని అందిస్తున్నారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది కోసం టేబుల్స్, చైర్స్ ఏర్పాటు చేశారు. పాఠశాల అసెంబ్లీ ప్రాంగణమంతా అందంగా తీర్చిదిద్దారు. పాఠశాల ప్రహరీ చుట్టూ బౌండరీ వాల్ నిర్మించారు. పాఠశాలకు ప్రత్యేక గేట్‌తో పాటు ఆకర్షించేలా ఆర్చి తీర్చిదిద్దారు. అన్ని తరగతి గదుల్లో గ్రీన్ బోర్డ్స్, వాష్ బేసిన్స్, గ్రిల్స్, గేట్లు, నేమ్ బోర్డ్స్ ఏర్పాటు చేశారు. 40 యూరినల్, టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు. ప్రేయర్ చేసే ప్రాంగణమంతా పార్కింగ్ టైల్స్‌తో తీర్చిదిద్దారు. పెయింటింగ్స్ వేశారు. అత్యాధునికంగా సైన్స్ ల్యాబ్ అందుబాటులోకి తెచ్చారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా విద్యార్థులకు సులువుగా పాఠాలు నేర్పుతున్నారు. విద్యార్థులకు పెద్ద సంఖ్యలో ట్యాబ్స్ అందజేశారు.

ఎంతో లబ్ధి..

తరగతి గదిలో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డ్ (ఐఎఫ్‌పీ) ద్వారా విద్యార్థులకు ఎంతో లబ్ధి చేకూరుతోంది. చదువుతున్న తరగతికి సంబంధించిన పాఠ్యాంశాలతో పాటు జనరల్ నాలెడ్జి, సాంకేతిక పరిజ్ఞానంతో పాటు గత ఏడాది విద్యార్థి మెరిట్.. ప్రస్తుతం ఉన్న మెరిట్.. ఇలా ఎన్నో అంశాలను క్రోడీకరించి ఇటు విద్యార్థులు.. అటు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటోంది.



అత్యాధునికంగా ఎంవీడీ పాఠశాల

ఎంవీడీ పాఠశాల అభివృద్ధి ఇలా..

- రూ. 51 లక్షలతో ఎంవీడీ ప్రాథమికోన్నత పాఠశాలకు నూతన హంగులు
- ఆకట్టుకునేలా పాఠశాల ప్రధాన ఆర్చి నిర్మాణం
- అన్ని తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (ఐఎఫ్‌పీ) బోర్డులు
- గతంలో విద్యార్థుల సంఖ్య 330.. ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 675
- ప్రతి తరగతి గదిలో కొత్త ఫ్లోరింగ్.. ప్రతి రూములో 4 ఫ్యాన్లు, 4 ట్యూబ్‌లైట్ల ఏర్పాటు
- పాఠశాల ప్రహరీ చుట్టూ బౌండరీ వాల్ నిర్మాణం
- ప్రత్యేక గేట్‌తో పాటు ఆకర్షించేలా ఆర్చి నిర్మాణం



విద్యార్థులకు ప్యూరిఫై వాటర్

ప్రభుత్వ చర్యలు అద్భుతం..



రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధికి సంబంధించి చేపడుతున్న చర్యలు అద్భుతం. పాఠశాలకు మంచి లుక్ వచ్చింది. మౌలిక సదుపాయాలు అమోఘం. గతంలో 330 మంది విద్యార్థులుంటే.. ప్రస్తుతం ఆ సంఖ్య 675కి చేరింది. వీరిలో 383 మంది బాలురు, 292 మంది బాలికలు ఉన్నారు. అంటే ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయులు అందించే విద్యకు ప్రాధాన్యత పెరిగినట్లే. పాఠశాలల అభివృద్ధి, విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి హేట్సాఫ్.

బుద్దా జగన్నాథరావు, ప్రధానోపాధ్యాయుడు, జీవీఎంసీ ఎంవీడీ హైస్కూల్, దండుబజార్

స్కూల్ బాగుంది..

మాస్టార్లు చెప్పే చదువుతో పాటు పాఠశాల ప్రాంగణమంతా బాగుంది. మేము చదువుకోవడానికి అన్ని వసతులు ప్రభుత్వం కల్పించింది. ముఖ్యంగా టాయ్‌లెట్స్.. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నాయి. బెంచీలు, కుర్చీలు బాగున్నాయి. ఉపాధ్యాయుడు మాకు చదువు చెప్పేందుకు ఏర్పాటు చేసిన గ్రీన్‌బోర్డు ద్వారా మేము అభ్యసించేది క్లియర్‌గా ఉంటుంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

– హాసిని, విద్యార్థిని

మాలాంటి పేదలకు కార్పొరేట్ విద్య..

మాలాంటి పేద విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కార్పొరేట్ విద్యనందించడం అభినందనీయం. విద్యతో పాటు మౌలిక సదుపాయాలు బాగున్నాయి. ఉపాధ్యాయులు మాకు మంచిగా పాఠాలు చెబుతున్నారు. పాఠశాల ఆవరణ అంతా బాగుండడంతో ఇంటి వద్ద కన్నా పాఠశాలే బాగుంటుంది. ఓ వైపు విద్యనందిస్తూ.. మరోవైపు భోజనం కూడా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది.

– నిరూప్, విద్యార్థి



పాఠశాలలోని ల్యాబ్ పరికరాలు



తరగతి గదిలో బెంచీలు

పరిశుభ్రత అందరి బాధ్యత



35వ వార్డులో చెత్త తొలగిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



కొబ్బరితోటలో కార్పొరేటర్ పద్మావతి పర్యవేక్షణలో చెత్త తొలగిస్తున్న సిబ్బంది

జగదాంబ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం అందరి బాధ్యత అని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నగర మేయర్ ఇచ్చిన పిలుపు మేరకు కార్పొరేటర్ వీధులు, రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో..

అల్లిపురం : గత కొద్ది రోజులుగా జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. దీంతో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి శనివారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు సహాయంతో జేసీబీ ఉపయోగించి చెత్త తొలగించే కార్యక్రమం స్వయంగా చేపట్టారు. ఆమె పర్యవేక్షణలో వార్డులో పలు ప్రాంతాల్లో గల చెత్త నిల్వలను తొలగించారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. తమ ప్రాంతాలు శుభ్రపడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

లయన్స్ క్లబ్ చేయూత

- కృష్ణా జూనియర్ కాలేజీ విద్యార్థుల ఫీజుల చెల్లింపు



ఫీజులు చెల్లించిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పేద విద్యార్థుల ఫీజుల కోసం లయన్స్ క్లబ్ రూ.18,700 అందించింది. కాలేజీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు చెరుకు శ్రీరామూర్తి, ఎం.రంగబాబు, ఎం.సురేష్, జి.వీరభద్రరావు నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న 34 మంది విద్యార్థుల పరీక్ష ఫీజుల కోసం ఒక్కొక్కరికీ రూ.550 చొప్పున రూ.18,700 అందించామని తెలిపారు. ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులు చేయూత అందించి లయన్స్ క్లబ్ ప్రతినిధులు సేవా నిరతిని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు, అధ్యాపకులు సూర్యకుమారి, వేదవ్యాస్, మురళీకృష్ణ, ఆర్.పి.నాయుడు పాల్గొన్నారు.

యోగానంద నారసింహుడిగా అప్పన్న



స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది



యోగానంద నారసింహ అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదోరోజు శనివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి యోగానంద నారసింహుడి అలంకరణలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని యోగానంద నారసింహుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకిలో అధిష్ఠింపజేసి సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి విశేషంగా నిర్వహించారు.

జీవవైవిధ్య ఉద్యానవనం సందర్శన

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులోని జీవవైవిధ్య ఉద్యానవనాన్ని శనివారం పెన్ స్కూల్‌కి చెందిన 100 మంది విద్యార్థులు సందర్శించారు. మొక్కల ప్రత్యేకతలు, ఔషధ గుణాలు, వైవిధ్యతలను పార్క్ నిర్వాహకులు డాక్టర్ మంథా రామమూర్తి వివరించారు. పుస్తకాల్లో చదువుకునే విభిన్న జాతుల వృక్షాలను ప్రత్యక్షంగా వీక్షించడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

సెయింట్ జోసెఫ్‌లో రైతుల దినోత్సవం

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో అగ్రికల్చర్–రూరల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రైతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయంపై విద్యార్థులు ప్రదర్శించిన మైమ్ ఆకట్టుకుంది. అగ్రికల్చర్ విభాగ అధ్యాపకులు తేజస్విని, ఊర్విశ, దీపిక, గణేష్ పర్యవేక్షణలో విద్యార్థులు త్యాధునిక సాంకేతిక పద్ధతులపై చేసిన నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల పీఆర్‌వో, హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె. జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అలాగే స్వామివారికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది.1001 నామాలతో స్వామికి అర్చన చేశారు.

విజ్ఞాన్ యువతరంగ్ పోస్టర్ ఆవిష్కరణ

అగనంపూడి: దువ్వాడలోని విజ్ఞాన్ విద్యా సంస్థల సారథ్యంలో వచ్చేనెల 11వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జాతీయ స్థాయిలో యువతరంగ్ నిర్వహించనున్నట్టు దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు చెప్పారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో విజ్ఞాన్ యువతరంగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, ఫార్మాస్యూటిక్ కళాశాల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఫెస్ట్‌లో దేశం నలుమూలల నుంచి భారీ స్థాయిలో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. క్రీడలు, సాంస్కృతిక, నృత్యం, ఫ్లాష్‌మాబ్, రంగోలి విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు రూ.5లక్షల వరకు నగదు పారితోషికం అందివ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సుధాకర్, వై.శ్రీనివాసరావు, బి.అరుంధతి, ప్రోగామ్ కోఆర్డినేటర్ బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉంటేనే విజయం వైపు పయనం



డాక్టర్ నందగోపాల్‌ను సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్ : లక్ష్యం ఉంటేనే విజయం వైపు పయనించగలమని ఏవీఎన్ కళాశాల కరస్పాండెంట్ ఏవీ అదీప్ భానోజీరావు తెలిపారు. కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ‘ది ఫ్యూచర్ ఆఫ్ వర్క్స్’పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యం లేకుండా గమ్యాన్ని చేరుకోవడం సాధ్యం కాదని, ప్రతి మనిషి ఓ లక్ష్యంతో పని చేయాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించాలని, దీని కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ఏ వృత్తిలో రాణించాలన్నా దాని గురించి ముందుగా తెలుసుకోవాలన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా పాల్గొన్న డాక్టర్ నందగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా నైపుణ్యం ప్రదర్శించేందుకు అవసరమైన పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. సదస్సుకు అధ్యక్షతన వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేలా ఎన్నో సెమినార్లు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐజరాపు సర్వేశ్వరరావు, బి. మురళి, రాజ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, సురేష్, బాబు, ప్రదీప్, ఆనంద్, సంతోష్, అనంతలక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ సత్యనారాయణరాజు

జగదాంబ : ఇంజినీరింగ్ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ సూపరింటెండింగ్ ఇంజినీర్ కేవీవీ సత్యనారాయణరాజు అన్నారు. శనివారం ఆయన జీవీఎంసీ 35వ వార్డులో 1.60 కోట్లతో ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. స్టేడియం చుట్టు గ్యాలరీ, కిందవైపు ఉన్న గదులు, స్టేడియం లోపల బయట ఉన్న కాలువలు, పెవిలియన్ బాక్స్‌ల మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణాల్లో లోపాలు ఉండకూడదన్నారు. నివేదికల ఆధారంగా నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టాలన్నారు. త్వరితగతిన పనులు జరగాలని ఆదేశించారు. స్టేడియంకు అవసరమైన హంగుల కోసం కమిషనర్‌తో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ అనిల్, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలలో క్విజ్ పోటీలు



క్విజ్ పోటీలో పాల్గొన్న జూనియర్ కళాశాలల విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కళాశాల వాణిజ్యం, మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం క్విజ్ ప్రిలిమనరీ పోటీ నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వీరిని 34 టీములుగా ఏర్పాటు చేశారు. మొత్తం 185 మంది పోటీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి నిర్వాహకులు క్విజ్ పోటీ నిర్వహించారు. జనవరి 5న క్విజ్ ఫైనల్ పోటీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్స్, వాణిజ్య, మేనేజ్‌మెంట్ విభాగం అధిపతులు, జూనియర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.